క్లుప్తంగా

నేడు మండల సమావేశం

మరికల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యశోదమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అధికారులు తమ నివేదికలతో రావాలని సూచించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

మరికల్: భవన కార్మికుడిగా పనిచేస్తూ గతకొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న మండలానికి చెందిన ఉందేకోడ్ వెంకటన్నకు ఆ సంఘం మండల అధ్యక్షుడు గోపి మంగళవారం వైద్యఖర్చుల నిమిత్తం 15వేలు ఆర్థికసాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపి, కుర్మన్న, శ్రీనివాసులు, వెంకటన్న, రమేష్, లక్ష్మణ్, రాజు, వెంకటేష్, నారాయణ, హన్మంతు, మైనోద్దీన్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అనిల్ కుమార్



మద్దూరు: కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా ఎస్. అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అనిల్ కుమార్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మమత దామరగిద్ద తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. మండలంలో భూ సంబంధింత సమస్యల పరిష్కారానికి తనవంత కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

అధికారులకు కృతజ్ఞతలు

కృష్ణా: పోలింగ్‌బూత్ ఏర్పాటుకు అవకాశం కల్పించడంతో రెవెన్యూ అధికారులకు ఖాన్‌దొడ్డి గ్రామస్తులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలోని ఖాన్‌దొడ్డికి బూత్‌ఏర్పాటుచేయాలని గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తహసీల్దార్, కలెక్టర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తిచేస్తున్నామని, ఎట్టకేలకు స్పందించిన అధికారులు తమ గ్రామానికి పోలింగ్ బూత్‌ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు గ్రామస్తులు, అఖిలపక్షాల నాయకుల ఆధ్వర్యంలో హర్షంవ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలకు ప్రీ స్కూల్‌పై శిక్షణ



మరికల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోకు వస్తున్న చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించేందుకు మంగళవారం మండలంలోని రైతువేదిక వద్ద ప్రీ స్కూల్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ.. ప్రీ స్కూల్‌పై టీచర్లకు శిక్షణ ఇవ్వడంతో వారు చిన్నారి పిల్లలకు అదేస్థాయిలో ఆటపాటలతో నేర్పిస్తారన్నారు. ఈ విధానంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు కూడా ఎక్కువగా వచ్చేఅవకాశం ఉందన్నారు.

దామరగిద్ద: పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక శిక్షణ ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూప అన్నారు. మంగళవారం మండలంలోని రైతువేదిక వద్ద ప్రీ స్కూల్‌పై శిక్షణ ఇచ్చారు. ఈమేరకు ఆటపాటల ద్వారా విద్యార్థులకు చదువు నేర్పడం, స్వీయ, జట్టు బోధనపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఆయా సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓకు సన్మానం

ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో హెల్త్‌సెంటర్ నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ శైలజ, వైద్యబృందాన్ని ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, బాల్‌రాజులు శాలువాతో సన్మానం చేశారు. తమ గ్రామానికి హెల్త్‌సబ్‌సెంటర్ కేటాయించడంపై సన్మానం చేశారు. వైద్యసిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

వెంకట్‌రాంరెడ్డికి ఘననివాళి



నారాయణపేట: వెంకట్‌రాంరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక రెడ్డి సోదరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి గొప్పవ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి సహకరించండి

అమరచింత: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నామని, తమ పనులను ఇతరులతో చేయిస్తూ ఆందోళనకు విఘాతం కలిగించొద్దని రెండో ఏ ఎన్ఎంలు తిపుడంపల్లి వైద్యాధికారి డాక్టర్ శరత్ కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తమను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు ఉమామహేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

చదువు ప్రాధాన్యత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

- విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలి
- పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలి
- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ



'పిల్లల కోసం కమ్యూనిటీ మూవ్‌మెంట్' కార్యక్రమ బ్రోచర్లు విడుదల చేస్తున్న వాకాటి కరుణ

నారాయణపేట రూరల్/ ధన్వాడ: చదువుతో బాధ్యత పెరిగి సమాజంలో తనకంటూ ఒక విలువను సంపాదించుకోవచ్చనే విషయాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన 'పిల్లల కోసం- కమ్యూనిటీ మూవ్‌మెంట్' అనే కార్యక్రమాన్ని జిల్లాలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని సింగారంగేట్ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కలెక్టర్ శ్రీహర్ష అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతున్నాయని, చాలా వరకు ప్రభుత్వ స్కూళ్లలో అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. మన ఊరు- మన బడిలో మూడోవంతు పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామన్నారు. విద్యా బోధనలో ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని, దీనికి తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారం జోడిస్తే మరింత బాగుంటుందని అభిప్రాయపడ్డారు. పిల్లలు డుమ్మా కొట్టకుండా వందశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రతినెలా నిర్వహించే పీటీఎం సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వానికి సమాంతరంగా గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి గ్రామ ప్రజాప్రతినిధులు ప్రత్యేక సమయం వెచ్చించడంతోపాటు ఆర్థికంగా సహకరించాలని కోరారు. నాణ్యమైన విద్యను అందించేందుకు టీచర్లు సైతం అదనపు సమయం కేటాయించాలని చెప్పారు.

మోడల్ జిల్లాగా మారుద్దాం..

'పేట'ను విద్యారంగంలో సానుకూల మార్పులతో రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థాయికి తీసుకువచ్చి మోడల్ జిల్లాగా నిలబెడదామని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. ఇప్పటికే విద్యార్థుల అభివృద్ధికి డీఈఓ, ఏఎంఓ, సెక్టోరియల్ అధికారులు విస్తృతంగా కృషి చేస్తున్నారని, 45 రోజుల అభ్యాస దీపిక కార్యక్రమంతో సరికొత్తగా పిల్లల ఎదుగుదలకు పాటుపడుతున్నారని అభిప్రాయపడ్డారు.

ఉపాధ్యాయులకు అభినందన..

ధన్వాడ మండలం కిష్టాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు సుధీర్ భిన్నంగా ఆలోచించి గ్రామస్తులను ఆకట్టుకున్నారని అభినందించారు. వలంటీర్లను ఏర్పాటుచేసి ప్రైవేటుకు దీటుగా సాయంత్రం 6 గంటల వరకు చిన్నారులకు ట్యూషన్ చెప్పించడం, స్నాక్స్ అందించడం, ఆర్థికంగా గ్రామస్తుల సహకారం తీసుకోవడంపై ప్రశంసించారు. అలాగే మండలంలోని లక్ష్మీపూర్‌లో యాద్గీర్ జనార్దన్‌రెడ్డి, బసిరెడ్డిపల్లిలో శేర్‌కృష్ణారెడ్డి సైతం చక్కటి సేవలు అందిస్తున్నారని సభలో పేర్కొన్నారు. ధన్వాడలోని సంతబజార్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారు. సంతబజార్ సీపీఎస్‌లో వెలుగు అభ్యాసాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలను కొద్దిసేపు విన్నారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ పరికరాలను విద్యార్థులు చూపించారు. అలాగే రెండురోజులపాటు హెచ్‌ఎంలకు నిర్వహిస్తున్న టీచింగ్ లెర్నింగ్ ట్రైనింగ్‌ను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మయాంక్‌మిత్తల్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి, ఏఎస్‌పీడీ రమేష్, ఆర్‌జేడీ విజయలక్ష్మి, జేడీ వెంకటనర్సమ్మ, సువర్ణ, వినాయక్, ఇన్‌చార్జ్ డీఈఓ రవీందర్, డీపీఓ మురళి, జెడ్పీసీఈఓ జ్యోతి, సెక్టోరియల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, పద్మనళిని, రాజేంద్రకుమార్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజలి, ఎంఈఓలు, సర్పంచ్‌లు, ఎస్ఎంసీ చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ధన్వాడలో మాట్లాడుతున్న వాకాటి కరుణ

విద్యాశాఖ కార్యదర్శికి వినతుల వెల్లువ..

నారాయణపేటరూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణకు పలువురు వినతిపత్రాలు అందించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, కో-షాధికారి కిశోర్ ఆధ్వర్యంలోని బృందంకలిసి టీచర్ల అన్నిరకాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, పారిశుద్ధ్య చర్యలకు ఆటంకం లేకుండా రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని కోరారు.

ఎమ్మెల్యే చిట్టెంకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నర్వ: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి మళ్లీ బీఆర్ఎస్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండల నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు తిరిగి గెలిపిస్తాయన్నారు. కేసీఆర్ ఎమ్మెల్యే గెలుపుపై నమ్మకంతో టికెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, నాయకులు కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, దండు అయ్యప్ప, డా.శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న వంటఏజెన్సీకార్మికులు

మద్దూరు: మధ్యాహ్నభోజన కార్మికులు మంగళవారం మండలంలోని ఎమ్మార్సీకార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గతేడాది డిసెంబర్‌నుంచి తమకు బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అలాగే గుడ్డు బిల్లులు, ఏప్రిల్ నుంచి తమకు గౌరవవేతనం అందలేదన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళ కార్మికులు పద్మమ్మ, సలీమాబేగం, వెంకటేష్, నారాయణమ్మ, సాబేరాబేగం, సరోజ, సులోచన, అనిత, బుజ్జమ్మ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్దూరు: మండలంలోని కొత్తపల్లి, లింగల్‌చేడ్, ఎక్కమేడ్ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏ విధంగా ఓటువేయాలి, ఓటు పడిందా లేదా అనేది ఏ విధంగా తెలుసుకోవాలో వారికి వివరించారు. ఓటింగ్ మిషన్లపై ప్రజలకు అవగాహనకోసం వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు ఆర్ఐ శ్రవణ్ తదితరులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కలశాభిషేక పూజ



108 మంది దంపతులతో కలశాభిషేక పూజ

నారాయణపేట: పట్టణంలోని సాయి విజయకాలనీ తొట్లా హనుమాన్ ఆలయంలో శ్రావణమాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకొని 108 కలశాలలో కృష్ణానది నుంచి జలాలను తెప్పించి 108 మంది దంపతులతో పూజారి బ్రహ్మచారి ఆధ్వర్యంలో కలశపూజలు చేశారు. అంతకుముందు హనుమాన్ మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం, మహా మంగళహారతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పూజారి బ్రహ్మచారి మాట్లాడుతూ.. 108 కలశల పూజ చేయడంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ఇంటిల్లిపాది సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదులో జాగ్రత్తలు పాటించాలి



శిక్షణ ఇస్తున్న డీసీఆర్‌బీ ఎస్ఐ సునీత

నారాయణపేట రూరల్: పీఎస్‌లలో వచ్చేఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదులో జాగ్రత్తలు పాటించాలని డీసీఆర్‌బీ ఎస్ఐ సునీత అన్నారు. మంగళవారం జిల్లాలోని అన్ని పీఎస్‌లలో టెక్‌టీమ్ అధికారులకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి వర్టికల్ అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, కేసుల విషయంలో టెక్నికల్ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్క సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని, పీఎస్‌లో జరిగే ప్రతి విషయాన్ని ఎస్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఐటీకోర్ శ్రీనివాసులు, ఎండీ సాబేర్, ఆపరేటర్లు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు



దామరగిద్ద: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ సురేష్ తీరుమార్చుకోవాలని రైతులు మంగళవారం బ్యాంక్ మేనేజర్ జైపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శరణ్యనాయక్, సీపీఎం నాయకుడు శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులకు తిరిగి రుణాలు చెల్లించడం లేదన్నారు. రెన్యూవల్ చేసిన రైతులకు రుణమాఫీ డబ్బులు పడిన వెంటనే తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలంటూ ఆర్థిక శాఖ మంత్రి బ్యాంకర్‌లను ఆదేశించిన బ్యాంక్ ఫీల్డ్ అధికారి పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నర్సింహులు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



మక్తల్: మండంలోని మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ బాల్‌రాంనాయక్ ఇంటింటికీ తిరిగి గృహలక్ష్మి పథకం దరఖాస్తులను ఇంటి వద్ద స్థలం, పూరి గుడిసె, రేకుల షెడ్డు ఉన్న వాటిని పరిశీలించారు. పూర్తి చిరునామా, ఆధార్‌కార్డు, ఓటర్ కార్డును తనిఖీ చేశారు. మండలంలోని 16వార్డుల్లో 18వందల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

గిరిజనులతో కర్ణాటక ఎమ్మెల్యే సహపంక్తి భోజనం



గిరిజనులతో కలిసిభోజనం చేస్తున్న ఎస్ఎన్ చెన్న బస్సప్ప

నారాయణపేటరూరల్: బీజేపీ నిర్వహిస్తున్న అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కర్ణాటక శివమొగ్గ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్ఎన్ చెన్నబస్సప్ప గిరిజన తండాల్లో పర్యటించారు. మండలంలోని పిల్లిగుండ్లతండా, పాతతండాకు వెళ్లివారి సమస్యలను తెలుసుకున్నారు. మోదీచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు సాయిబన్న, రాందాస్ నాయక్, నర్సింహులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి



మాట్లాడుతున్న రాజు

మరికల్: బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు సగభాగం సీట్లు ఇవ్వకపోవడంతో మహిళలే కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు కనీసం 30 అసెంబ్లీ టిక్కెట్లు ఇవ్వకుండా విస్మరించడం పద్ధతి కాదన్నారు. కేవలం 5శాతం మాత్రమే ఉన్న రెడ్డివర్గానికి 40 టిక్కెట్లు ఇవ్వడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కుటుంబపాలనకు చరమగీతం పాడలంటే బీసీలు ఐక్యమత్యంతో ఉండి కేసీఆర్ అహంకార ప్రభుత్వాన్ని గద్దెదించే సమయం వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లో అధిక స్థానాల్లో బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఇందుకుగాను మహిళలోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాప్రధాన కార్యదర్శి లింగంగౌడ్, భజరప్ప, ఆంజనేయులుగౌడ్, తిరుపతయ్యగౌడ్, వెంకటన్న, వీరేష్, రవికుమార్ ఉన్నారు.

సమగ్ర విచారణ జరపాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌లో దళిత యువకుడు ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలని దళిత ప్రజా సంఘాల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని తండ్రి మారెప్పను కోరినా తన కొడుకు శవాన్ని పోస్టుమార్టం చేస్తారని భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. మారెప్పను కొందరు వ్యక్తులు బెదిరించడం వల్లే ఫిర్యాదు చేయలేదని ఆరోపించారు. ఈ ఘటనపై సుమోటాగా కేసు నమోదుచేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఎం.మారెప్ప, రమేష్, వెంకటేష్, తిమ్మప్ప, మారుతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

మాగనూర్: ప్రభుత్వం ఆశాకార్యకర్తలకు వేతనం రూ. 18వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు కోరారు. మండల పరిధిలో ఉన్న ఆశాకార్యకర్తలు ధర్నాలో పాల్గొంటారని తమకు అనుమతివ్వాలని డాక్టర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఆశాకార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ధన్వాడ: ప్రభుత్వం ఆశాకార్యకర్తలకు వేతనం రూ. 18వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌ఎదుట ధర్నా సందర్భంగా తమకు అనుమతివ్వాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ అనురాధాకు ఆశాకార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రకళ, పద్మ, అంజలిమణి, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి : ఎస్.రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్: పేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసినందుకే మరో సారి కేసీఆర్ టికెట్ ఇచ్చారని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయిచూర్ నుంచి మరికల్‌కు వస్తుండగా కార్లతో ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు మండలంలోని స్వాగతంపలికి చౌరస్తాలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లినట్లు తెలిపారు. మూడోసారి నియోజకవర్గ ప్రజలు ఆశ్వీరదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్‌చైర్మన్ సురేఖ, తిరుపతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, బసంత్, కృష్ణారెడ్డి, రాజేష్, రామస్వామి, శేఖర్‌లు పాల్గొన్నారు.

పంటల నమోదుతో రైతులకు ప్రయోజనం



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ దామోదర్

అమరచింత: రైతులు తాము పండించిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు విన్నవించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ దామోదర్ అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, చింతరెడ్డి పల్లె గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతులకు పంటల నమోదు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పండిన పంటను అమ్ముకొనే సమయంలో వ్యవసాయ అధికారులు ధ్రువీకరించే అవకాశం ఉందని, దీంతో రైతులు ఎక్కడైనా తమ పంటను అమ్ముకొనే వీలుందన్నారు. సాగుచేసిన పంటలకు అకాల విపత్తుల కారణంగా నష్టం వాటిల్లితే ప్రభుత్వపరంగా గుర్తించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లేష్, సర్వారెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

నారాయణపేట: ప్రపంచ జానపద దినోత్సవాన్ని శ్రీ రాఘమయి సంగీత నృత్య శిక్షణకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజస్వామి విగ్రహానికి పూజలుచేసి జానపద నృత్య శిక్షకుడు మల్లేశ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ మేరకు బాలు అభిమాన సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి , టీవీ రేడియో గాయకులు నర్సింహులు మాట్లాడుతూ.. ముక్కోటి జీవరాసులను ఓలాడించే శక్తి సంగీతానికి ఉందని, సమాజంలో సామాన్యులకు సైతం అర్థమయ్యే భాషతో జనం మధ్యలో నుంచి పుట్టే పాటనే జానపదమే జానపదమన్నారు. అర్హులైన కళాకారులకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, వసంత్, రాము, అంజలి, చిన్నారులు పాల్గొన్నారు.



మల్లేశ్‌ను సన్మానిస్తున్న గాయకులు

చంద్రయాన్ ఆకారంలో విద్యార్థులు



నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం చంద్రయాన్ ఆకారంలో కూర్చొని మృత్యుంజయ మంత్రాన్ని పఠించారు. భారత శాస్త్రవేత్తల బృందం ప్రయోగించిన చంద్రయాన్-3 బుధవారం సాయంత్రం చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ సేఫ్‌గా ల్యాండ్ కావాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తుచౌద్రి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి మంగళవారం పారిశుద్ధ్య పనులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ అయూబ్‌ఖాన్, బాలగోవింద్, కృష్ణయ్య, పలువురు పాల్గొన్నారు.